గ్రామాభివృద్ధిపై శిక్షణ కలెక్టర్ల ప్రత్యేక దృష్టి!





బుధవారం 4 నవంబర్ 2026 పేజీలు : 8

ఆరోగ్యం, విద్య, భద్రత పైఆదివాసీ గ్రామాల్లో పోలీసుల అవగాహన

చెరువుగూడ గ్రామంలో పోలీసు మీకోసం కార్యక్రమం

6 గ్రామాల ప్రజలకు 6 విభాగాల వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి.. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించాలి

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చదువుఒక్కటే భవిష్యత్తును మార్చే ఆయుధం.. జిల్లాఎస్పీఅఖిల్ మహాజన్





రేపు (నవంబర్ 5న) సింగరేణి కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ పంపిణీ



కార్మికుల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ జమ చేయనున్న సింగరేణి యాజమాన్యం

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లింపు

మొత్తం రూ.419 కోట్ల బోనస్ పంపిణీకి ఏర్పాట్లు

19 ఏళ్లలో రూ.6 వేల నుంచి రూ.1.10 లక్షలకు చేరిన పీఎల్ఆర్ బోనస్

సుమారు 38 వేల మంది కార్మికులకు లబ్ధి

రూ. 28 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి 'భూమిపూజ' చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నేరడిగొండ, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): మండలంలోని బుద్దికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులతాండ గ్రామంలో మంగళ వారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విస్తృతంగా

లింగట్ల గోండుగుడలో ఘనంగా దండారి ఉత్సవాలు

నేరడిగొండ నవంబర్ 03 (ప్రజా జ్యోతి): మండలంలోని లింగట్ల గోండుగూడ గ్రామంలో ఆదివాసీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టేలా భోగి పండుగ వేడుకలను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఘనంగా నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ పటేల్ పెందూర్ ఆశారావు ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్ ఇంటి వద్ద ఉన్న సాంప్రదాయ జెండా చుట్టూ గుస్సాడి సామగ్రిని ఉంచి, ఆదివాసీ ఆచారాల ప్రకారం నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులందరూ ఐక్యంగా పాల్గొని దండారి ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో



పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పూజారి మాడవి ఆనంద్ రావు, గ్రామ పెద్దలు పెందూర్ భీమ్రావు, సిడం సంతోష్, సిడం గంగాధర్, పెందూర్ లక్ష్మణ్, ఇందూరు ప్రభు తదితరులతో శ్రీ యువకులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు తమ వంతు భాగస్వామ్యాన్ని చాటుకున్నారు.

రూ. 28 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి 'భూమిపూజ' చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్





నేరడిగొండ, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): మండలంలోని బుద్దికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులతాండ గ్రామంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 28 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... రాజులతాండ చిన్న గ్రామమైనప్పటికీ, గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని గ్రామస్తులకు భరోసానిచ్చారు. రాబోయే రోజుల్లో రాజులతాండ నుంచి పొచ్చర గ్రామం వరకు ప్రజల రవాణా సౌకర్యార్థం నూతనంగా బీటీ రోడ్డును సైతం నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. గ్రామంలోని ప్రజలందరూ ఐకమత్యంతో, కలిసిమెలిసి ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తాండ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణ ఆరోగ్య పరిరక్షణకు ఆశా కార్యకర్తలు కృషి చేయాలి

--?నేరడిగొండ పి హెచ్ సి లో ఆశాల సమీక్షా సమావేశం

నేరడిగొండ, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ మేరకు మంగళవారం నేరడిగొండ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ, సకాలంలో ఏఎన్‌సీ నమోదు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రసవానంతరం తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు పీఎన్‌సీ సేవలు అందించడంపై ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ఐదేళ్లలోపు చిన్నారులకు వయసు వారీగా అందించాల్సిన



రోగనిరోధక టీకాలు వందశాతం పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. టీకాలకు దూరంగా ఉన్న చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ చేరేలా ఆశా కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) ప్రేమ్‌లత, హెల్త్ సూపర్‌వైజర్ బి. స్వర్ణలత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 3 ,(ప్రజాజ్యోతి) భూముల రీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ముధోల్ మండలం చందాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం పట్టా భూముల విస్తీర్ణం, సాగునీటి వసతులు ఉన్న భూములు, ఇతర భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూ హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ రీ సర్వే చేపట్టాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీలత, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు





నిర్మల్ టౌన్, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): రానున్న వేసవిలో నిర్మల్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. అధికారులతో కలిసి ఎస్సార్ఎస్పీ ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వలు, వేసవిలో సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం పట్టణ అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని, అనుకోని పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, పైపులైన్ లీకేజీలను గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపి, పెండం శ్రీనివాస్, నాందేడపు చిన్ను, రఫీ, చెనిగరపు నరేష్, జకి, శ్రీకాంత్ యాదవ్, డీఈ హరిభువన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణ కలెక్టర్ల ప్రత్యేక దృష్టి!





--ఫామ్‌పాండ్, వాటర్ ప్లాంట్, పశువుల నీటి తొట్టె, గ్రామ మ్యాప్ పరిశీలన

నేరడిగొండ, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా శిక్షణ కలెక్టర్ల బృందం మంగళవారం నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించింది. పర్యటనలో భాగంగా గ్రామంలోని ఫామ్‌పాండ్‌ను సందర్శించి దాని వినియోగం, నీటి శుద్ధి ప్లాంట్ పనితీరును పరిశీలించారు. అలాగే పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెను పరిశీలించారు. అనంతరం రైతు వేదిక ఎదుట ఏర్పాటు చేసిన గ్రామ మ్యాప్‌ను పరిశీలించి, గ్రామ భౌగోళిక పరిస్థితులు, అభివృద్ధి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే సోషియో మ్యాప్ రూపకల్పనపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. గ్రామంలోని వనరులు, ప్రజల అవసరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, సమగ్ర గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడమే పర్యటన ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. గంగాసాగర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉపసర్పంచ్ ఆడేపు రవి, వి జి ఎస్ ఏరేకర్ రాజేశ్వర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాల ను విజయవంతం చేయండి

జిల్లా విద్యాధికారి మాధవి

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) విద్యార్థులలో ఉన్న మూఢ నమ్మకాలు అశాస్త్రి ఆలోచనలను తొలగించి విజ్ఞాన అ భివృద్ధి కోసం కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తు న్న చెకుము కి సైన్సు సంబురాలను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాల ని జిల్లా విద్యాధికారి మాదవి కోరారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చెక్కముఖి సైన్స్ సంబురాలు 2026 పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఈఓ మాదవి మాట్లాడు తూ ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ పరీక్ష విజయవంతానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీకి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సైన్స్ అధికారి ఆరె భాస్కర్,



సెక్టోరియల్ అధికారి సరిత,రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ జిల్లా అధ్యక్షులు కత్తి శ్రీధర్ బాబు ప్రధాన కార్యదర్శి మెస్రం రాజు జిల్లా ఉపాధ్య క్షులు బాస లింగన్న, జవేందర్ ప్రశాంత్, రాజా శేఖర్, లిం గారెడ్డి, కలవల శంకర్ పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో పంటల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన జోగురామన్న

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా రైతుల స మస్యలపై మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో ని ర్వహించిన రైతు గర్జన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకు న్న అనంతరం, మంగళవారం జైనథ్ మండలంలోని దీపాయి గూడ గ్రామంలో ఉన్న తన సొంత వ్యవసాయ పొలాన్ని జోగురామన్న సందర్శించారు. ఎల్ నినోప్రభావంతో పంటల ఎదుగుదలపై నెలకొన్న పరిస్థితులను నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ముఖ్యంగా పత్తి పంట ఎదుగుదలతో పాటు పత్తి కాయల పరిస్థితిని నిశితంగా గమనించి, వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు. రాజకీయ కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ, మరోవైపు తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తూ పంటల పరిస్థితులపై దృష్టి సారించడం విశేషం. రైతుల కష్టాలు, వ్యవసాయ సమ స్యలపై కేవలం రాజకీయ వే దికలపైనే కాకుండా, క్షేత్ర స్థాయిలోనూ తనకు ఉన్న అవగాహన,



వ్యవసాయంపై ఉన్న మక్కువ, రైతుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని జోగు రామన్న మరోసారి చాటుకు న్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, నితిన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండల పరిషత్ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం



సోనాల, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): సోనాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధికారి రత్నాకర్ రావు (ఎంపీడీవో) మరియు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై సుదీర్ఘంగా చర్చించారు. మండలంలో ఫారం పాండ్ల నిర్మాణం మరియు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు మోసం

నిందితుడి అరెస్ట్

విదేశీ ఉద్యోగం పేరుతో న మ్మించి డబ్బులు వసూలు

నకిలీ ఆఫర్ లెటర్ (సింగ పూర్ ఆఫర్ లెటర్) పంపిం చి మోసం

ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఇచ్చోడ ఇన్స్పెక్టర్ వి ప్రవీణ్ కుమార్



ఇచ్చోడ, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.2 లక్షలు మోసం చేసిన నిందితుడిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఇచ్చోడ ఎస్ హె చ్ఓ వి. ప్రవీణ్ కుమార్ తెలి పారు. ఇచ్చోడ మండలం జామిడి గ్రామానికి చెందిన పిలవన్ శ్యామ్ అనే యువకుడు 2024లో హైదరాబా ద్‌లో ఎయిర్ హోస్టెస్ కోచింగ్ కోసం వెళ్లిన సమయంలో అమీర్‌పేటలోని హ్యాష్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ గురించి తెలుసుకున్నాడు. అక్కడ పనిచేస్తున్న గోచిపాతుల అనిల్ కుమార్ అనే వ్యక్తి విదేశాల్లో ఉద్యోగ వీసా ఇప్పిస్తానని, అందుకు రూ.2 లక్షలు అవసరమని చెప్పడంతో బాధితుడు నమ్మి 2026 ఏ ప్రిల్ 18 నుండి జూన్ 11 వరకు విడతల వారీగా ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.2 లక్షలు చెల్లించాడు. అనంతరం నిందితుడు బాధితుడికి వాట్సాప్ ద్వారా ఆఫర్ లెటర్, సింగపూర్ రావడానికి ఆఫర్ కార్డు పంపించాడు. అయితే వాటి నిజానిజాలపై అను మానం వచ్చిన బాధితుడు సింగపూర్ ప్రభుత్వ వెబ్ సై ట్‌లో పరిశీలించగా ఎలాంటి వివరాలు లభించలేదు. నిందితుడిని సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వకుండా ఫోన్‌లకు స్పందిం చడం మానివేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మే రకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 465/202 6, సెక్షన్ 318(4) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేపట్టారు. ఈ మేర కు గోచిపాతుల అనిల్ కు మార్ (28), శ్రీను, స్వ స్థలం ప్రకాశం జిల్లా పండ లపాడు మండలం కందుకూ రు గ్రామం, ప్రస్తుతం హైద రాబాద్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు విదేశాల్లో ఉద్యోగా లు ఇప్పిస్తామని చెప్పే కన్స ల్టెన్సీలు, వ్యక్తులను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించే విషయంలో అప్రమత్తంగా ఉండా లని, వారి వివరాలు, పత్రాల నిజానిజాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ వి. ప్రవీణ్ కుమార్ సూచించారు.

ఆరోగ్యం, విద్య, భద్రత పైఆదివాసీ గ్రామాల్లో పోలీసుల అవగాహన











చెరువుగూడ గ్రామంలో పోలీసు మీకోసం కార్యక్రమం

6 గ్రామాల ప్రజలకు 6 విభాగాల వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించాలి

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చదువుఒక్కటే భవిష్యత్తును మార్చే ఆయుధం

జిల్లాఎస్పీఅఖిల్ మహాజన్

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) ఆదివాసీ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంతో పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో చెరు వుగూడ గ్రామంలో పోలీసు మీకోసం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 6 గ్రామాల ప్ర జలకు 6 విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో ఉచి త వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 300 మం ది గ్రామ ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ మూఢనమ్మ కాలు, బాబాలను నమ్మకుం డా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు వై ద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు మె రుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సాగు చేయడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆర్హ త కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సంఘ విద్రోహ శక్తులకు దూ రంగా ఉన్నప్పుడే గ్రామాల్లో ప్రశాంతత, అభివృద్ధి సాధ్య మవుతుందని పేర్కొన్నారు. బాలబాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని, చదువు ఒక్కటే జీవితాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధ మని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసు అక్క లేదా డయల్ 112 ద్వారా పోలీ సులను సంప్రదించాలని, స మస్యలను నిర్భయంగా తె లియజేయాలని సూచించారు. తల్లిదండ్రులు బాల్యవి వాహాలకు దూరంగా ఉండాలని, బాల్యవివాహాల సమాచారం తెలిసిన విద్యార్థినులు పోలీసులకు నిర్భయంగా సమాచారం అందించాలని తెలిపారు.యువత ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమా దాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు విభాగాలకు చెందిన వైద్య నిపుణు లచే ఉచిత వైద్య సేవలు అందించారు. కంటి సమస్యలు ఉన్నవారికి ఆదిలాబాద్‌లో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి, అనంతరం తమ వాహనాల్లో గ్రామానికి తిరిగి చేరవేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, గ్రామ ప్రజలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ఉ ట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఎస్ఐ జి. విజయ్, ఆదిలాబాద్ నుండి వచ్చిన వైద్యులు డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ టి. వెం కటేష్, డాక్టర్ ఇందూజ, డా క్టర్ శ్వేత, డాక్టర్ సౌమ్య, డా క్టర్ సాగ్నిక్, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ భగవంత రావు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థులు త దితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆదివాసుల దీపావళి సందడి!

--గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించిన మహిళలు..

నేరడిగొండ, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆదివాసీ మహిళలు సందడి చేశారు. తలమడుగు మండలంలోని సోనాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన ఆదివాసీ మహిళలు మంగళవారం ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని తమదైన గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పండుగ వాతావరణాన్ని



మరింత ఆహ్లాదకరంగా మార్చారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా మహిళలు చేసిన



నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి ఆటపాటలతో ఎమ్మెల్యే నివాసం సందడిగా మారింది.

ఏంద గ్రామంలో, లింగోజి తాండ ఉట్నూర్ ఎక్స్ రోడ్డు లో 15 సీసీటీవీ కెమెరాల ప్రారంభం







నేరాల నియంత్రణలో సీసీ టీవీ కెమెరాల పాత్ర కీలకం

చదువుతోనే ఉన్నత లక్ష్యా లను సాధించగలం

విద్యార్థులు చదువుతో పా టు క్రీడల్లోనూ రాణించాలి

గ్రామ ప్రజల చొరవ అభినం దనీయం

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఎంద గ్రామంలో, లింగోజి తాండ, ఉట్నూర్ ఎక్స్ రోడ్ లో 15 సీసీటీవీ కెమెరా లు ప్రారంభం

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) నేరాల నియంత్రణ లో సీసీ టీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, చదువుతూనే ఉ న్నత లక్ష్యాలను సాధించ వ చ్చని జిల్లా ఎస్పీ అఖిల్ మ హజన్ స్పష్టం చేశారు.ఏంద గ్రామంలో, లింగోజి తాండ, ఉట్నూర్ ఎక్స్ రోడ్ లలో గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన 15 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రా రంభించారు. (ఏందా గ్రా మంలో 9, లింగోజి తాండ ఎక్స్ రోడ్డు లో ఆరు సీసీటీవీ కెమెరాలు) ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరాలనియం త్రణ, అసాంఘిక కార్యకలా పాల నివారణలో సీసీ టీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలక మని తెలిపారు. గ్రామ ప్రజ లు ఉన్నతంగా ఆలోచించి గ్రామ భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయ డం అభినందనీయమని ప్ర త్యేకంగా ప్రశంసించారు. పా ఠశాల విద్యార్థులను ఉద్దే శించి మాట్లాడుతూ చదువు అనే ఆయుధంతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, విద్య ఒక్కటే ఉజ్వల భవి ష్యత్తుకు మార్గమని తెలిపా రు. ప్రతిరోజూ కష్టపడి చది వితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూ చించారు. ప్రతి విద్యార్థికి ఒ క హాబీ ఉండాలని, హాబీల ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు. చదువుతో పా టు శారీరక వ్యాయామం, ఆటల్లో కూడా విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఏందా గ్రామ సర్పం చ్ కిరణ్ కుమార్ రాథోడ్, లింగోజి తాండ సర్పంచ్ మాయ హరినాయక్, పా ఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తది తరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు 18 వేల వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించి న్యాయమైన సమస్య లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ

డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మె చేపడుతున్నాం.ఆశా వర్కర్లు

లోనవెల్లి పీహెచ్సీలో మెడికల్ సూపర్ వైజర్ పద్మజా కు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేత:

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ :

నవంబర్ 3,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామంలోని పీహెచ్సీలో ఆశా వర్కర్ల నిరసన తమకు 18 వేల గౌరవ వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుండి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె చేస్తున్నట్లు లోనవెల్లి పిహెచ్సి మెడికల్ సూపర్వైజర్ పద్మజ కు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్,జిల్లా సహాయ కార్యదర్శి వెరిశాల కృష్ణమాచారి, వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చిలారి సురేఖ పీహెచ్సీ లీడర్ కేసర,కవితతో పాటు ఇతర పిహెచ్సి నాయకురాలు నిర్మల, శారద, మండల ఆశా వర్కర్లతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ..ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు.ఆశా వర్కర్లు ప్రజలకు నిరంతరం వైద్య ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు,గౌరవం, వేతనాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా వర్కర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తా



మని,డిసెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే నిరవధిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లు: ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం నెలకు రూ.18,000 నిర్ణయించి పిఎఫ్,ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి. రూ.50 లక్షల జీవిత బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలి. రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, పారితోషకాలలో సగం పెన్షన్గా ఇవ్వాలి. ప్రతి ఆదివారం, పండుగ సెలవులతో పాటు సంవత్సరానికి 20 రోజులు క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలి. ఏఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశా వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలి. 2వ పిఆర్సి లో కనీస వేతనం రూ.30,000 నిర్ణయించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన 2 డిఏ లను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలి. ఆశా వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చిలారి సురేఖ, పిహెచ్సి లీడర్ కేసర కవితతో పాటు ఇతర పీహెచ్సీ నాయకులు, నిర్మలా శారద పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపు (నవంబర్ 5న) సింగరేణి కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ పంపిణీ







కార్మికుల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ జమ చేయనున్న సింగరేణి యాజమాన్యం

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లింపు

మొత్తం రూ.419 కోట్ల బోనస్ పంపిణీకి ఏర్పాట్లు

19 ఏళ్లలో రూ.6 వేల నుంచి రూ.1.10 లక్షలకు చేరిన పీఎల్ఆర్ బోనస్

సుమారు 38 వేల మంది కార్మికులకు లబ్ధి

కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మంచిర్యాల, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):సింగరేణి బొగ్గు గని కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న దీపావళి పీఎల్ఆర్ (పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) బోనస్ పంపిణీకి రంగం సిద్ధమైంది. రేపు (నవంబర్ 5న) సింగరేణి కార్మికుల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ మొత్తాన్ని జమ చేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ ఏడాది ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చొప్పున మొత్తం దాదాపు రూ.419 కోట్లను బోనస్ రూపంలో చెల్లించనున్నారు. సుమారు 38 వేల మంది కార్మికులకు ఈ బోనస్ ద్వారా లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ బోనస్ చెల్లింపునకు ఆదేశాలు జారీ చేశారు.

బోనస్ చెల్లింపునకు భట్టి విక్రమార్క ఆదేశాలు..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అక్టోబర్ 30న విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. నవంబర్ 5వ తేదీన పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్‌ను కార్మికులకు చెల్లించాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. దీపావళి బోనస్ కింద రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 అందించనున్నట్లు తెలిపారు .రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి, విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల దసరా సందర్భంగా లాభాల వాటా బోనస్ కింద దాదాపు రూ.600 కోట్లు చెల్లించగా, తాజాగా దీపావళి బోనస్ రూపంలో మరో రూ.419 కోట్లు కార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పెరుగుతున్న పోటీని అధిగమించేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్స్ అధికారులతో మాట్లాడి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరాక్ సింగరేణి యాజమాన్యం సర్కులర్ ను కూడా జారీ చేసింది

19 ఏళ్లలో రూ.6 వేల నుంచి రూ.1,10,250కు..

బొగ్గు గని కార్మికులకు చెల్లిస్తున్న పీఎల్ఆర్ బోనస్ గత 19 ఏళ్లలో భారీగా పెరిగింది. 2007లో రూ.6 వేలుగా ఉన్న ఈ బోనస్ 2026 నాటికి రూ.1,10,250కు చేరుకుంది. అంటే ఈ కాలంలో ఒక్కో కార్మికుడికి అందే బోనస్ మొత్తం రూ.1,04,250 మేర పెరిగింది. కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు సంస్థలతో పాటు సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న నాన్ ఎగ్జిక్యూటివ్ (ఎన్‌సీడబ్ల్యూఏ) కార్మికులకు ఈ బోనస్ చెల్లిస్తున్నారు. సింగరేణిలో దీపావళి పండుగ సందర్భంగా దీనిని చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. గత 20 ఏళ్ల బోనస్ చెల్లింపు వివరాలు పరిశీలిస్తే.. 2007లో రూ.6 వేలుగా ప్రారంభమైన పీఎల్ఆర్ 2008లో రూ.8,350కు, 2009లో రూ.10 వేలకు చేరింది. 2010లో రూ.15 వేలు, 2011లో రూ.21 వేలు, 2012లో రూ.26,500, 2013లో రూ.31,500గా పెరిగింది. 2014లో రూ.40 వేలు, 2015లో రూ.48,500, 2016లో రూ.54 వేలు, 2017లో రూ.57 వేలు, 2018లో రూ.60,500గా నమోదైంది. అదేవిధంగా 2019లో రూ.64,500, 2020లో రూ.68,500, 2021లో రూ.72,500, 2022లో రూ.76,500, 2023లో రూ.85,500, 2024లో రూ.93,750, 2025లో రూ.1,03,000కు చేరింది. తాజాగా 2026లో రూ.1,10,250కు పెరిగింది.

గత మూడేళ్లలో పెరుగుదలలో హెచ్చుతగ్గులు..

పీఎల్ఆర్ బోనస్ మొత్తం ప్రతి ఏడాది పెరుగుతున్నప్పటికీ, ఏడాదికి పెరిగిన అదనపు మొత్తం మాత్రం ఒకే విధంగా లేదు. 2008లో రూ.2,350, 2009లో రూ.1,650, 2010లో రూ.5 వేలు, 2011లో రూ.6 వేలు, 2012లో రూ.5,500, 2013లో రూ.5 వేలు పెరిగింది. 2014, 2015లో వరుసగా రూ.8,500 చొప్పున పెరుగుదల నమోదైంది. 2016లో రూ.5,500, 2017లో రూ.3 వేలు, 2018లో రూ.4 వేలు, 2019 నుంచి 2022 వరకు ఏడాదికి రూ.4 వేల చొప్పున పెరిగింది. 2023లో రూ.9 వేలు, 2024లో రూ.8,250, 2025లో రూ.9,250 పెరిగింది. అయితే 2026లో రూ.7,250 మాత్రమే పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెరుగుదల రూ.2 వేల మేర తగ్గినప్పటికీ, బోనస్ మొత్తం మాత్రం సరికొత్త గరిష్ట స్థాయికి చేరడం విశేషం.

ఈ బోనస్ ఎన్‌సీడబ్ల్యూఏ కార్మికులకు మాత్రమే వర్తింపు..

ఈ దీపావళి పీఎల్ఆర్ బోనస్ కేవలం ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోని నాన్ ఎగ్జిక్యూటివ్ కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. అధికారులకు ఈ బోనస్ వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్‌కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయి బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ పని దినాలు ఉన్నవారికి వారు పనిచేసిన కాలానికి అనుగుణంగా నిష్పత్తి ప్రకారం బోనస్ లెక్కించి చెల్లిస్తారు. అయితే బోనస్ పొందేందుకు గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసి ఉండాలనే అర్హతను నిర్ణయించారు. ఈ నిబంధనల ప్రకారం సుమారు 38 వేల మంది కార్మికులకు బోనస్ అందనుంది.

నెల రోజుల వ్యవధిలోనే రూ.1,020 కోట్ల బోనస్‌లు..

ఇటీవల దసరా సందర్భంగా లాభాల వాటా బోనస్, తాజాగా దీపావళి పీఎల్ఆర్ బోనస్ కలిపి సింగరేణి యాజమాన్యం సుమారు రూ.1,020 కోట్లను కార్మికులకు చెల్లిస్తోంది. ఈ రెండు బోనస్‌ల రూపంలో ఒక్కో కార్మికుడికి సగటున దాదాపు రూ.2,65,000 వరకు అందనున్నాయి. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, బోనస్ సొమ్మును కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అవకాశం ఉన్న మేరకు పొదుపు చేసుకోవాలని సూచించారు. పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేస్తూ గనుల వారీగా, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కోరారు.

కార్మిక కుటుంబాల్లో దీపావళి ఆనందం..

సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా అందే పీఎల్ఆర్ బోనస్ వారి కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తోంది. పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, పండుగ ఖర్చులు, ఇతర అత్యవసర అవసరాలకు ఈ అదనపు ఆదాయం ఉపయోగపడుతోంది. కోల్ ఇండియా పరిధిలోని సంస్థల్లో పీఎల్ఆర్ బోనస్‌ను దసరా పండుగకు ముందు చెల్లిస్తుండగా, సింగరేణిలో దీపావళికి ముందు చెల్లించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. బోనస్ మొత్తం పెరుగుదలలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, కష్టపడి బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా దీపావళి జరుపుకునేందుకు ఈ బోనస్ దోహదపడుతోంది. ఈ ఏడాది కూడా నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో బో

విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణ పనులపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక పర్యవేక్షణ





మంచిర్యాల, 3, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ విశ్వనాథ ఆలయాన్ని మరింత వైభవంగా పునర్నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులను మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వయంగా పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, పనులను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. మంచిర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన శ్రీ విశ్వనాథ ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దడంతో పాటు, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పునర్నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఆలయ అభివృద్ధి పనులు నాణ్యతతో, ప్రణాళికాబద్ధంగా సాగాలనే ఉద్దేశంతో స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఈఓ ముక్త రవి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పరిశోధనా పత్రం సమర్పించిన డాక్టర్ ఎం.జ్యోతి



మంచిర్యాల, 3, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా (హెచ్ఓడీ) విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.జ్యోతి జాతీయ స్థాయి సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొని, “పాలసీ టు ప్రాక్టీస్: ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ ఔట్‌కమ్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ గర్ల్స్ ఇన్ జగిత్యాల్ డిస్ట్రిక్ట్” అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి రంగాల్లో జగిత్యాల జిల్లాలోని పాఠశాల స్థాయి బాలికల సాధించిన ఫలితాలను విధానాల అమలుతో అనుసంధానిస్తూ ఆమె ఈ పత్రాన్ని రూపొందించారు. జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పించిన డాక్టర్ ఎం.జ్యోతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత, వైస్ ప్రిన్సిపాల్ వహీదా, ఇతర అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

అనుమానాస్పద వ్యక్తులకు డీసీపీ ఎ. భాస్కర్ కౌన్సెలింగ్..

నేరాలకు పాల్పడితే రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరిక



మంచిర్యాల, నవంబర్, 3 (ప్రజా జ్యోతి):మంచిర్యాల జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిఘా ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్రే కాలనీలో సోమవారం అర్ధరాత్రి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీరాంపూర్ సీఐ అశోక్, ఎస్ఐ తహసీనుద్దీన్‌లతో కలిసి ఆయన ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ కలిగిన వ్యక్తులతో పాటు అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా వాహనాలపై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించిన యువకులను గుర్తించి విచారించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, రాత్రి వేళల్లో అనవసరంగా సంచరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినా, నేరప్రవృత్తిని కొనసాగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, నేరాల తీవ్రతను బట్టి రౌడీషీట్లు తెరిచి కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జయరాణి పాఠశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన



జన్నారం,నవంబర్3(ప్రజాజ్యోతి)జన్నారం మండల అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జయరాని పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోజున అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చర్యలు, అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి,అగ్నిమాపక పరికరాల వినియోగం, 101 నంబర్‌కు సమాచారం అందించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.వంటగదిలో, పాఠశాలలో, ఇంట్లో అగ్ని ప్రమాదాల నివారణకు పాటించాల్సిన భద్రతా నియమాలను వివరించారు. అగ్నిప్రమాదాల సమయంలో భయపడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల మధుసూదన్,అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలోని మహాప్రస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు





మంచిర్యాల, 3, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులో గోదావరి నది తీరాన ఉన్న మహాప్రస్థానాన్ని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) రాహుల్ కిషన్ జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా మహాప్రస్థానంలోని ఏర్పాట్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ అన్వేష్, అడిషనల్ కమిషనర్ రాజు, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ సింగతి మురళి, జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కార్పొరేటర్లు, మహాప్రస్థాన కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

వేగవంతమైన చర్యలు తీసుకోవాలి..
రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్

మంచిర్యాల, 3, నవంబర్ (ప్రజాజ్యోతి): భూముల రీ-సర్వే, భూభారతి పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ కేసుల పురోగతి, భూదాన్ భూములు, భూముల రీ-సర్వే, హైకోర్టు కేసులు, భూభారతి పథకంలో పాత, కొత్త పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూసేకరణ, యూఎల్‌సీ భూములు, జీవో నంబర్లు 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. భూదాన్ భూములకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయడంతో పాటు, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.



యూఎల్‌సీ భూములు, జీవో నంబర్లు 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అందుబాటులో ఉన్న భూ రికార్డుల ఆధారంగా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతిని వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ-సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం, సంబంధిత అధికారుల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా జీవో నంబర్లు 59, 76, 118 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలి







జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల, నవంబర్, 3 (ప్రజా జ్యోతి):ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి, విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలు, సివిల్ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది, తాగునీటి సదుపాయాలు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, ఇతర సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. విద్యార్థుల వసతి గృహాలు, వంటగదిని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. నీటిని వృథాను అరికట్టాలని, ప్రతి నీటి బొట్టును బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. నీటి వృథాకు కారణమవుతున్న లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ఎఫ్ ఆర్ ఎస్ వివరాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధాన భవనం వెలుపల లైటింగ్ సదుపాయం సరిగా లేని విషయాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యు ఐ డి సి ఎఈ బషీర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గుత్తేదారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు అయిన కార్మికులకు శుభవార్త

సింగరేణిలో గైర్హాజరు కారణంగా తొలగింపునకు గురైన వారి కేసుల పునఃపరిశీలనకు దరఖాస్తుల ఆహ్వానం

పూర్తి వివరాలతో సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి):సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించ బడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 1, జనవరి ,2023 నుంచి 31,డిసెంబర్, 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 1,ఏప్రిల్, 2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని తెలిపింది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఇవీ అర్హతలు....

తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (అండర్ గ్రౌండ్), కేటగిరీ-× పోస్టులో పునఃనియామ కం కోసం వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అర్హత కలిగి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాల నుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, తాము చివరగా పనిచేసిన గని లేదా డిపార్ట్‌మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14,నవంబర్ 2026 గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం నిర్దిష్ట తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడుని పరమార్శించిన మంచిర్యాల జిల్లా నాయకులు



మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి):కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ద పల్లి కిషన్ రావు ఇటీవల కొంత అనారోగ్యానికి గురై ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టశీ పురుషోత్తం రావు పటేల్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయన ఇంటికి వెళ్ళి పరమార్శించారు. ఈ పరమార్శలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబిలపు శ్రీనివాస్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం పటేల్, రాష్ట్ర కార్యదర్శి దేవల్ల అరుణ్ కుమార్ పటేల్, ఆసిఫాబాద్ తాలూకా అధ్యక్షులు గాజుల జక్కన్న పటేల్ లు కలిసి వారికి మనో ధైర్యం తెలిపారు.

యువత అన్ని రంగాలలో రాణించాలి







జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి):యువత అన్ని రంగాలలో ముందుండాలని, దేశ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026 కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, వీధి నాటకాలు, చిత్రలేఖనం, కవితా పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని, ఇలాంటి పోటీలు యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆయా విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ, యువతలోని సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజనోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. యువతీ యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ, జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటున్న విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. యువత తమలోని నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సామాజిక సేవా కార్యక్రమాలలో విశేషంగా సేవలందించిన యువజన సంఘాల ప్రతినిధులను సన్మానించారు. అనంతరం వివిధ కేటగిరీలలో పోటీలలో పాల్గొని మొదటి మూడు స్థానాలలో నిలిచిన విజేతలకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి హనుమంత రెడ్డి, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ, సంబంధిత అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లాలో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక డ్రైవ్

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

పి.చంద్రయ్య

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి): వేసవి కాలంలో ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గ్రామీణ నీటి సరఫరా ఈ.ఈ. వెంకటేష్, మిషన్ భగీరథ ఈ.ఈ. మధుసూదన్ లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, డి.ఈ.లు, ఎ.ఈ.లతో సమీక్ష సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా త్రాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల పనితీరును మెరుగుపరచడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రిడ్, బల్క్ వాటర్ సప్లై పథకాల ద్వారా మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలకు శుద్ధి చేసిన నీరు సక్రమంగా చేరేలా పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీ కార్యాచరణ ప్రకారం మండల స్థాయి బృందాలు అన్ని ఆవాసాలను సందర్శించి త్రాగునీటి సరఫరా పరిస్థితి, పైప్‌లైన్లలో లీకేజీలు, వాల్వ్‌ల పనితీరు, నీటి సరఫరా వ్యవస్థలోని లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, మ్యాన్‌హోల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు, నీటి ట్యాంకులకు క్లోరినేషన్ నిర్వహించాలని, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్ వినియోగించి త్రాగునీటి నాణ్యతను నిర్ధారించాలని సూచించారు.





ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాలలో ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు 1916 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేసి, రానున్న వేసవి కాలంలో ప్రజలందరికీ సురక్షితమైన, నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి):దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరసనల నేపథ్యంలో ప్రజలు వాస్తవాలను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సూచించారు. ఆందోళనల పేరుతో దేశంలో అలజడులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్న ఆరోపణలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఎం కన్వెన్షన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సదస్సుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌పై ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను తెలుసుకోవడంతో పాటు దాని ఉద్దేశాలు, ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమ చొరబాటుదారులు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డబుల్ ఓట్లను తొలగిస్తున్నారని, అర్హులైన ఏ ఒక్క ఓటరుకు అన్యాయం జరగకుండా చూడటమే ఈ ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ చేస్తున్న నిరసనలు దేశంలో గందరగోళ పరిస్థితులు సృష్టించేలా ఉన్నాయని విమర్శించారు. విదేశీ శక్తుల ప్రమేయంపై కూడా ఆయన ఆరోపణలు చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, నిరసనల వెనుక ఉన్న వాస్తవాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు, వైద్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, పలువురు మేధావులు, ఇతరులు పాల్గొన్నారు.





గుడుంబా స్థావరాలపై ఉక్కుపాదం!

అలుగామలో పోలీస్, ఎక్సైజ్ అధికారుల సంయుక్త దాడులు

25 లీటర్ల నాటుసారా స్వాధీనం.. 2 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ముగ్గురిపై కేసులు.. పత్రాలు లేని 40 వాహనాలు సీజ్

చెన్నూరు, నవంబర్ 3: గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కోటపల్లి మండలం అలుగామ గ్రామంలో మంగళవారం పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీ, విక్రయాలకు సంబంధించి దుర్గం స్వామి, దాగం రమేష్, దాగం గోపాల్‌పై కేసులు నమోదు చేశారు.

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టారు.



యువత మత్తుకు దూరంగా ఉండాలి

ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ.. గుడుంబా తయారీకి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొద్దిపాటి ఆదాయం కోసం గుడుంబా తయారు చేస్తూ పేద కుటుంబాల జీవితాలను నాశనం చేయవద్దన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి విక్రయించినా, సేవించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

40 వాహనాలు సీజ్

అనంతరం గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సరైన వాహన పత్రాలు లేని 40 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, నిల్వాయి ఎస్ఐ నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సాయి, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

వాంకిడి ఎంపీడీఓ కార్యాలయంలో మీడియా వివక్ష?

సమావేశాల సమాచారంలో కొందరికే ప్రాధాన్యం..


మిగతా విలేకరులకు అలస్యంగా సమాచారం?

సమానంగా సమాచారం అందించాలని జర్నలిస్టుల డిమాండ్.. ఉన్నతాధికారులు స్పందించాలి

ఆసిఫాబాద్ నవంబర్ 3 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల స్థాయిలో నిర్వహించే ప్రభుత్వ సమావేశాల సమాచారాన్ని మీడియా ప్రతినిధులందరికీ సమానంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే వాంకిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో సర్వసభ్య సమావేశాల సమాచారం అందించే విషయంలో పక్షపాతం చూపుతున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. కొందరు మీడియా ప్రతినిధులకు ముందుగానే సమాచారం అందుతుండగా, మరికొందరికి ఆలస్యంగా తెలుస్తోందని పలువురు విలేకరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశాల్లో గ్రామాల అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామపంచాయతీల పనితీరు, నిధుల వినియోగం వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతుంది. ప్రజలకు సంబంధించిన ఇలాంటి సమావేశాల వివరాలు వెలుగులోకి రావాలంటే మీడియా ప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించడం అవసరం. అయితే సమావేశాల తేదీ, సమయం, అజెండా వివరాలు అందరికీ ఒకేసారి తెలియజేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మీడియాలో వర్గాల చర్చ..

వాంకిడి మండలంలో మీడియా ప్రతినిధుల మధ్య రెండు వర్గాలు ఉన్నాయనే ప్రచారం కూడా స్థానికంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కార్యాలయ అధికారులు ఒక వర్గానికి చెందిన విలేకరులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులకు సైతం సమావేశాల సమాచారం సక్రమంగా అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.



పారదర్శక సమాచార పంపిణీ ఏదీ?

ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే సమావేశాల సమాచారం ఏ ఒక్క మీడియా సంస్థకో, కొందరు విలేకరులకో పరిమితం కాకుండా అందరికీ సమానంగా అందించాల్సిన అవసరం ఉంది. సమావేశాల తేదీ, సమయం, అజెండాను ముందుగానే వాట్సాప్ గ్రూపులు లేదా అధికారిక సమాచార వ్యవస్థ ద్వారా పంపితే ఇటువంటి అపోహలకు అవకాశం ఉండదు. సమావేశం అనంతరం తీసుకున్న నిర్ణయాలను కూడా మీడియాకు తెలియజేయడం ద్వారా ప్రజలకు సమగ్ర సమాచారం చేరుతుంది.

ఉన్నతాధికారులు స్పందించాలి

వాంకిడి ఎంపీడీఓ కార్యాలయంలో మీడియా సమాచార పంపిణీపై వస్తున్న ఆరోపణలను ఉన్నతాధికారులు పరిశీలించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. సమావేశాల సమాచారం అందరికీ సమానంగా చేరేలా స్పష్టమైన విధానం అమలు చేయాలని, మీడియా ప్రతినిధుల మధ్య ఎలాంటి వర్గీకరణకు తావులేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమాచార పంపిణీలో వివక్ష ఉందా? లేక సమన్వయ లోపం కారణంగా సమస్య తలెత్తిందా? అనే అంశాలపై అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

జన్నారం అడవుల్లో అరుదైన మచ్చల అటవీ గుడ్లగూబ దర్శనం

చిత్రీకరించిన వన్యప్రాణి పరిశోధకుడు డాక్టర్ వెంకట్



జన్నారం,నవంబర్3(ప్రజాజ్యోతి) జన్నారం డివిజన్ పరిధిలోని ఇంధన్‌పల్లి రేంజ్‌లో అరుదైన మచ్చల అటవీ గుడ్లగూబను వన్య ప్రాణి పరిశోధకుడు డా. వెంకట్ అనగంధుల చిత్రీకరించారు ఇది భారత ఉపఖండానికి చెందిన రాత్రి చర వేట పక్షి. గోధుమ, తెలుపు మచ్చలు, పెద్ద గుండ్రని ముఖం, నల్లని కళ్ళు దీని ప్రత్యేక లక్షణాలు. పగటిపూట పెద్ద చెట్లపై విశ్రాంతి తీసుకుని, రాత్రి వేళ వేటాడు తుంది.ప్రధానంగా పొడి ఆకురాల్చే అడవులు, వ్యవసాయ భూములు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుంది. ఎలుకలు, చిన్న పక్షులు, బల్లులు, కీటకాలను ఆహారంగా తీసుకుని పంటలకు మేలు చేస్తుంది. ఎలుకల నియంత్రణ ద్వారా ఆహార గొలుసు సమతుల్యతను కాపాడుతుంది. ఐయుసిఎన్ ప్రకారం ప్రస్తుతం లీస్ట్ కన్సర్న్ స్థితిలో ఉన్నా, అడవుల నరికివేత, పెద్ద చెట్ల తొలగింపు వల్ల ఆవాసాలకు ముప్పు ఉందని డా. వెంకట్ తెలిపారు. పాత పెద్ద చెట్లు, సహజ ఆవాసాల పరిరక్షణ అవసరమని సూచించారు.

చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్

విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):చెన్నూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరచడంతో పాటు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యాలయంలోని వంట శాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.విద్యార్థినులకు ప్రభుత్వం మంజూరు చేసిన పడకలు, పరుపులను పరిశీలించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితి నిధులతో నిర్మించిన బస్టాండ్ ను కూల్చి ఆక్రమించిన వ్యక్తులపై

సిర్పూర్(టి) ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ అతారుద్దీన్, బీట్ ఆఫీసర్ భూమేశ్వర్ ఫిర్యాదు మేరకు కౌటాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు



నవంబర్ 3,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని కౌటాల మండ లం మొత్తంపేట్ గ్రామం లో అటవీశాఖ ఆధ్వర్యం లో వన సంరక్షణ సమితి నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను కూల్చి అక్రమించిన వ్యక్తులపై ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కౌటాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు. చేయడం జరిగిందని సెక్షన్ ఆఫీసర్ అతారుద్దీన్, బీట్ ఆఫీసర్ భూమేశ్వర్ తెలిపారు.అనంతరం వారు మాట్లాడు తూ..1998 సం.లో ముత్తం పేట్ గ్రామంలో సర్వే నెం. 06 లో 4 గుంటల భూమిని కొనుగోలు చేసి బస్టాండ్ నిర్మించడం జరిగిందని అన్నారు. అట్టి బస్టాండ్ పై కన్నేసిన ముత్తంపేట్ గ్రామానికి చెందిన గుజ్జ రమేష్ కొంత భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని అన్నారు. అదేవిధంగా మిగిలిన భూమిని అదే గ్రామానికి చెందిన గుజ్జ మధుకర్ ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించాలని తెలిపారు. ఇరువురు కలిసి బస్టాండ్ ను కూల్చి వేయంతో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ అతారుద్దీన్, బీట్ ఆఫీసర్ భూమేశ్వర్ కౌటాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయినట్లు తెలిపారు.

అగర్వాడలో 3-ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



కేరమేరి , నవంబర్ 3 ప్రజా జ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో అగర్వాడ గ్రామంలోని నింగుడ పరిధిలో 3-ఫేజ్ విద్యుత్ లైన్ అనుసంధానంతో పాటు భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన విద్యుత్ మీటర్ బోర్డును ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ వాడుగురే రోజా సోనాజి తెలిపారు.గ్రామ ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సరఫరాను మెరుగుపరచడం, భద్రతతో కూడిన విద్యుత్ సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ఈ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమృత్ 2.0 అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 3 (ప్రజాజ్యోతి): చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా నేత్ర వైద్య సేవలు

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్ నవంబర్ 3 ప్రజా జ్యోతి మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు జిల్లా కేంద్రంలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ విజన్ సెంటర్ (ఆసిఫాబాద్), డాక్టర్ ప్రభాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తవక్కల్ ఆప్టికల్స్ సెంటర్ వద్ద నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్‌తో కలిసి ఆమె రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరంలో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం తవక్కల్ ఆప్టికల్స్ సెంటర్ వద్ద శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కౌన్సిలర్ బాలకృష్ణలను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయక నిపుణులు, వివేకానంద సేవా సమితి డాక్టర్ రఘునందన్, బీఆర్ఎస్ నాయకుడు షకీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

యువత ఐక్యత, మతసామరస్యంతో ముందుకు సాగాలి

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిరంతర పోరాటం: దుర్గం నిఖిల్



ఆసిఫాబాద్ నవంబర్ 3 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఖిరిడి గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ వాంకిడి మండల కార్యదర్శి దుర్గం నిఖిల్ మాట్లాడుతూ.. 1980 నవంబర్‌లో ఏర్పాటైన డీవైఎఫ్ఐ అప్పటి నుంచి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. యువత హక్కుల సాధనతో పాటు సామాజిక బాధ్యతలను గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.యువతలో ఐక్యత, సోదరభావం, సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని కాపాడుతూ సమాజంలో శాంతి, స్నేహభావం వెల్లివిరిసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యువత సమాజ మార్పులో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కిరణ్, నిఖిల్, రాజ్ కుమార్, యాదవ్, తిరుపతితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

హోదాలకు దూరంగా.. కార్యకర్తలకు చేరువగా సుగుణక్క

సుగుణక్క ఆత్మీయతపై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ ప్రశంసలు



ఆసిఫాబాద్ నవంబర్ 3 ప్రజా జ్యోతి నాయకత్వమంటే పదవులు, ప్రత్యేక హోదాలు మాత్రమే కాదని, కార్యకర్తలతో కలిసి నడుస్తూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావడమేనని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క చాటారని వాంకిడి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలతో కలిసి బస్సులో ప్రయాణించడం ఆమె ఆత్మీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లే సమయంలోనే కాకుండా తిరుగు ప్రయాణంలోనూ కార్యకర్తలతో కలిసి రావడం అభినందనీయమన్నారు. ప్రత్యేక హోదాలు, ప్రత్యేక ప్రయాణాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కార్యకర్తలనే తన కుటుంబంగా భావిస్తూ వారితో కలిసిమెలిసి ఉండటం అందరిలో ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారని అన్నారు. సుగుణక్క తమకు కేవలం నాయకురాలు మాత్రమే కాదని, కుటుంబ సభ్యురాలిగా ఆప్యాయతను పంచుతూ అండగా నిలుస్తున్నారని ఉప్పుల కృష్ణ పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎన్నికలు జరిగే వరకు అన్ని కార్మిక సంఘాలతో యాజమాన్యం సమానంగా చర్చించాలి

బొగ్గు గనుల వేలం విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి):సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల గడువు ముగిసిన నేపథ్యంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగేంతవరకు గత ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని కార్మిక సంఘాలతో యాజమాన్యం సమానంగా చర్చలు జరపాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్), సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ) నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం విధానాన్ని విరమించుకోవాలని కోరారు. శ్రీరాంపూర్‌లోని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) డివిజన్ కార్యాలయంలో జీఎల్‌బీకేఎస్, ఎస్‌సీసీడబ్ల్యూయూ రెండు రీజియన్ కమిటీల సమావేశాలు ఏకకాలంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎల్‌బీకేఎస్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ. కృష్ణ మాట్లాడుతూ, సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ఈ ఏడాది సెప్టెంబర్ 9వ తేదీతో ముగిసిందని తెలిపారు. వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగేంతవరకు గత ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ గుర్తింపు సంఘం ఎన్నికల గడువు ముగిసిన తర్వాత ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగిన సమయంలో అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా అదే విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, జీఎం పర్సనల్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ యాజమాన్యం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా యాజమాన్యం ఎందుకు జాప్యం చేస్తోందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను ఇతర బడా పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు అప్పగించే ఉద్దేశంతో వేలం ప్రక్రియ చేపడుతోందని ఆరోపించారు. గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ తన సొంత ఖర్చులతో అన్వేషించి గుర్తించిన బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడానికి సిద్ధం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దూరమవుతాయని, ప్రస్తుతం సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు



ప్రైవేటు కంపెనీల్లో హక్కులు, సౌకర్యాలు అమలయ్యే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. అంతేకాకుండా సింగరేణి సంస్థకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి యాజమాన్యానికే అప్పగించాలని, వేలం ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్), సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ) బెల్లంపల్లి రీజియన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్, ఎం.డి. జాఫర్‌తో పాటు కమిటీ సభ్యులు పోతుల కిష్టయ్య, జగన్నాథ్ సంతోష్, భీముని పోషం, కామెళ్ల దేవయ్య, గజ్జి మల్లేష్, కొలిపాక సదానందం, శంకరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మద్యం కలకలం!

మద్యం మత్తులో విధులకు హెచ్ఎం?

మూడు రోజులుగా మద్యం సేవించి వస్తున్నారంటూ విద్యార్థుల ఆరోపణలు.. ఎంఈఓకు ఫిర్యాదు



ఆసిఫాబాద్ నవంబర్ 3 ప్రజా జ్యోతి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఆదర్శంగా నిలవాల్సిన ప్రధానోపాధ్యాయుడిపై మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు కలకలం రేపాయి. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ గత మూడు రోజులుగా పాఠశాల సమయాల్లో మద్యం సేవించి వస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. విధుల సమయంలో హెచ్ఎం మద్యం మత్తులో ఉండటాన్ని గమనించిన విద్యార్థులు ఆందోళనకు గురై తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు చేరుకుని పరిశీలించగా అక్కడ మద్యం సీసాలు కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్‌తో కలిసి మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు విఘాతం కలగకుండా ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనం నడిపిన సుంకిడి వాసి

హోండా యాక్టివా స్వాధీనం

నిందితుడిపై కేసు నమోదు, అరెస్ట్

2 టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగ రాజు

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నవంబర్ 2వ తేదీ రాత్రి వాహన తని ఖీలు నిర్వహిస్తున్న రెండవ పట్టణ పోలీసులకు నకిలీ నంబర్ ప్లేట్‌తో వస్తున్న హోండా యాక్టివా పట్టుబ డింది. 01 4975 నంబర్‌ను తనిఖీ చేయగా, వాహనం ఛాసిస్ నంబర్‌తో సరిపోలకపోవడంతో నకిలీ నంబర్ ప్లేట్‌గా గుర్తించారు. ఈ ఘటనలో రాథోడ్ సాయినాథ్ (29), సుంకిడి గ్రామం, సిరికొండ మండలం, ప్రస్తు తం ఆదిలాబాద్ నివాసిని అదుపులోకి తీసుకొని, హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై క్రైమ్ నంబర్ 748/2026, సెక్షన్లు 318 (4), 340(2) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి, నింది తున్ని మంగళవారం అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వాహనదారులు తప్ప నిసరిగా చట్టబద్ధమైన రిజి స్ట్రేషన్ నంబర్లతోనే వాహ నాలు నడపాలని, నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ కె. నాగరాజు తెలిపారు.



పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు

ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి


మంచిర్యాల ఆల్ ఫోర్స్ స్పోర్ట్స్ స్కూల్లో ముందస్తు దీపావళి సంబరాలు

చిత్రలేఖనాలతో విద్యార్థుల సందడి.. కాకర వత్తులు, మతాబులతో పండుగ వాతావరణం

మంచిర్యాల, 3, నవంబర్, (ప్రజాజ్యోతి): పండుగలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ప్రతి ఒక్కరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డు, గోదావరి రోడ్డులో ఉన్న ఆల్ ఫోర్స్ స్పోర్ట్స్ స్కూల్లో మంగళవారం ముందస్తు దీపావళి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన అమ్మావారికి ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రేయ పూజలను చేశారు .ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టి చిత్రలేఖనం ద్వారా రూపొందించిన ఆకర్షణీయమైన బోర్డులను ప్రదర్శించారు. వేదికను 'హ్యాపీ దీపావళి' అనే అక్షరాలతో అందంగా అలంకరించి వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని, విద్యార్థుల్లో ఐక్యత, సృజనాత్మకత, ఆనందాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా జరుపుకుంటూ, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి



ఉండాలని సూచించారు. విద్యార్థులందరూ విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డితోపాటు విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంతో సంతోషంగా కాకర వత్తులు, మతాబులు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో దీపావళి పండుగ నేడే అన్నట్లుగా సందడి, సందడిగా పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల ఆనందోత్సాహాలు, రంగురంగుల అలంకరణలు, దీపావళి వెలుగులతో ఆల్ ఫోర్స్ స్పోర్ట్స్ స్కూల్లో



ముందస్తు దీపావళి వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

ఎస్ఐఆర్ రద్దు చేయాలి

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి

సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌తో సమగ్ర విచారణ జరపాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ డిమాండ్

ఆసిఫాబాద్, నవంబరు 3 ప్రజా జ్యోతి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల హక్కులకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో సంఘం 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్ జెండా ఆవిష్కరించారు.అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్ల హక్కులు నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. తెలంగాణలోనూ 73 లక్షల మంది ఓటర్ల హక్కులకు ముప్పు పొంచి ఉందన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన ఎన్నికల సంఘం, ఓట్ల తొలగింపునకు దారితీసే విధానాలను అనుసరించడం సరికాదన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు టికానంద్ మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.4 వేల నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని, రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులకు



అందించాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్, నాయకులు కార్తీక్, పవన్, శ్రీను, రవికుమార్, లలిత, ప్రమీల, సంధ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ప్రజావాణిలో ఫిర్యాదు

అనర్హులను ఎంపిక చేశారంటూ మాజీ ఉపసర్పంచ్ అభ్యంతరం



కెరమెరి, నవంబర్ 3 ప్రజా జ్యోతి మండలంలోని పరండోలి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అనర్హులకు చోటు కల్పించారంటూ అదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఆడె గుణవంతురావ్ సోమవారం కెరమెరి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.గ్రామానికి చెందిన సులోచనకు ఇప్పటికే పక్కా ఇల్లు ఉన్నప్పటికీ, మట్టి ఇంటిలో నివసిస్తున్నట్లు చూపించి ఇందిరమ్మ ఇంటికి అర్హురాలిగా ఎంపిక చేసినట్లు ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నిరుపేదలు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఆదేశించినప్పటికీ, పక్కా ఇళ్లు ఉన్నవారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం వల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అనర్హులుగా తేలిన వారి ఎంపికను రద్దు చేసి, ఇళ్లు లేని పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీడీవోను విజ్ఞప్తి చేశారు.

అంతర్ పంటగా గంజాయి సాగు





62 గంజాయి మొక్కలు స్వాధీనం

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదిలాబాద్, డిస్టిక్ టాస్క్ ఫోర్స్ ఆదిలాబాద్ వారు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన దాడులలో మావల మండలంలోని వాగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాం గూడా గ్రామం శివారు ప్రాంతంలో అంతర్ పంటగా గంజాయి సాగు చేస్తున్నారన్న కచ్చితమైన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా కొలాం గూడా గ్రామానికి చెందిన కొడప జ్యోతిరామ్ కు చెందిన పత్తి, కంది అంతర్ పంటగా తన చేనులో తనిఖీ చేయగా దాదాపు 62 గంజాయి మొక్కలు పట్టుకు న్నట్లు అదిలాబాద్ ఎక్సైజ్ సి ఐ ఆకుల శ్రీ నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఆదిలాబాద్ ఎక్సైజ్ సిబ్బంది, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల శ్రీనివాస్, దేవేందర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (ట్రైని), డిస్టిక్ టాస్క్ ఫోర్స్ ఆదిలాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది తానా జీ, కృష్ణ, శివకు మార్, మధు, నగేష్, గౌతమ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ లో జరిగే యువగర్జన సభకు కార్యకర్తల తరలింపునకు భారీ ఏర్పాట్లు



లక్ష్మణ చాంద, నవంబర్ 3 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా కేంద్రంలో కేటీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న యువగర్జన సభకు లక్ష్మణ చాంద మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలను సమీకృతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.ఈ మేరకు మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జహీర్, భూమేష్ మహేష్ పండరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమై పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి యువతను పెద్ద ఎత్తున తరలించాలని నిర్ణయించారు.

సమస్యల పరిష్కారం కోసం ఆశ వర్కర్ల సమర బేరి!



సోనాల, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య రంగానికి వెన్నెముకగా నిలుస్తున్న ఆశ వర్కర్లు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మరోసారి సమర బేరి మోగించారు. కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తున్నప్పటికీ, ప్రభుత్వాల నుండి సరైన గుర్తింపు, గౌరవ వేతనం అందడం లేదంటూ ఆశ వర్కర్లు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చని యెడల, ఈ డిసెంబర్ 15 నుండి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోనాల పీహెచ్సీలో వైద్యాధికారి నవీన్ రెడ్డికి మెమోరాండం సమర్పించారు.

దీపావళి పండగ సందర్భంగా సిర్పూర్ టౌన్ హెచ్.పీ గ్యాస్ విత్రక్ వినియోగ దారుల కోసం ప్రత్యేకంగా నూతన నవ్య హెచ్పి గ్యాస్ కనెక్షన్ పథకం ప్రారంభం

ఈ పథకంలో భాగంగా నవ్య గ్యాస్ కనెక్షన్ ప్యాకేజీ తీసుకునే వినియోగ దారులకు కెన్ స్టార్ కంపెనీ కు చెందిన మిక్సీ గ్రైండర్ ఉచిత బహుమతిగా అందజేయడం జరుగుతుంది

ఈ పథకం ఈ నెల 3వ తేదీ నుండి 10తేదీ వరకు7 రోజులు మాత్రమే వినియోగ దారులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలి:

సిర్పూర్(టి) హెచ్ పి గ్యాస్ డీలర్ మొహమ్మద్ ఖుర్షీద్ హుస్సేన్:



నవంబర్ 3,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండల కేంద్రంలోని హెచ్.పీ గ్యాస్ గ్రామీణ విత్రక్ మొహమ్మద్ ఖుర్షీద్ హుస్సేన్ గ్యాస్ వినియోగదారుల కోసం దీపావళి పండగ సందర్భంగా ప్రత్యేకంగా నూతన నవ్య హెచ్పీ గ్యాస్ కనెక్షన్ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం గ్యాస్ డీలర్ మొహమ్మద్ ఖుర్షీద్ హుస్సేన్ మాట్లాడు తూ. హెచ్పి నవ్య గ్యాస్ నూతన కనెక్షన్ పథకంలో భాగంగా నవ్య గ్యాస్ కనెక్షన్ ప్యాకేజీ తీసుకున్న వినియోగదారులకు కెన్ స్టార్ కంపెనీ కు చెందిన మిక్సీ గ్రైండర్ ఉచితంగా బహుమతి అందజే యబడుతుందని అన్నారు. పండగల సీజన్ లను పురస్కరించు కొని దీపావళి పండగ సందర్భంగా ఈ పథకం లో భాగంగా పూర్తి నవ్యా గ్యాస్ కనెక్షన్ ప్యాకేజీ తీసుకొని వినియోగదారులకు ఈ నెల 3వ తేదీ మంగళ వారం రోజు నుండి10వ తేదీ మంగళవారం రోజు వరకు 8 రోజులు మాత్రమే ఆకాశముందని అన్నారు. ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగ దారులు సద్వినియో గం చేసుకొని 10 కిలోల నవ్య హెచ్పీ గ్యాస్ తోపాటు ఉచిత మిక్సీ గ్రైండర్ బహుమతి పొందాలని సూచించారు హెచ్పి నవ్య గ్యాస్ నూతన కనెక్షన్లు కావాలనుకున్న ప్రతి ఒక్కరు తిరుపూర్తి హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ కి రావాలని అన్నారు. హెచ్పి నవ్య నూతన గ్యాస్ ఫైబర్ తో చెయ్ తయారు చేయబడిందని అన్నారు ఈ గ్యాస్ సిలిండర్ పరిణామం 10 కిలోలు ఉంటుందని తెలిపారు. తేలికైన సిలిండర్ గ్యాస్ స్థాయిని గుర్తించే సదుపాయం తుప్పు పట్టకుండా ఉండే రక్షణ తో కూడుకున్న ప్రత్యేకతలు నవ్య హెచ్పీ నూతన గ్యాస్ కు కలదని అన్నారు. ఈ గ్యాస్ కనెక్షన్ తీసుకునే వారికి ఏదైనా ఐడి ప్రూఫ్ ఉంటే సరిపోతుందని అన్నారు.

బాసర ప్రతిష్టను దెబ్బతీయొద్దు

అభివృద్ధికి సహకరించండి: డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్

గత పాలకుల నిర్లక్ష్యంతోనే బాసర ఆర్జీయూకేటీ అధ్వాన్నం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో గాడిన పడుతున్న ట్రిపుల్ ఐటీ

విసి ప్రొఫెసర్ గోవర్ధన్ అద్భుత పాలనపై అసత్య ప్రచారాలు తగవు

చిన్న సమస్యలను భూతద్దంలో చూపిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం

నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్ విలేకరుల సమావేశం

బాసర నవంబర్ 3 (ప్రజా జ్యోతి)బాసర,పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీ (=+ఖఖు) ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు సోషల్ మీడియా గ్రూపుల్లో, పత్రికల్లో అసత్య ప్రచారాలు చేయడం సరికాదని నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్ హితవు పలికారు. మంగళవారం బాసరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మారుమూల ప్రాంతమైన బాసర అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో తాము సర్పంచ్‌గా, నారాయణరావు పటేల్ ఎమ్మెల్యేగా, వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండి ఎంతో శ్రమకోర్చి, భూసేకరణకు సహకరించి, కేసులు కూడా భరించి ఈ సంస్థకు పునాది వేశామని భావోద్వేగంగా పేర్కొన్నారు. దాదాపు 9 వేల మంది విద్యార్థులు, 2000 మంది సిబ్బంది, వేల మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ విశ్వవిద్యాలయాన్ని గత పదేళ్ల పాలకుల నిర్లక్ష్యం, నాటి వీసీ వెంకటరమణ వైఖరి వల్ల జూనియర్ కళాశాల కంటే అధ్వాన్నంగా మార్చేశారని మండిపడ్డారు. గాడిన పడుతున్న యూనివర్సిటీ.. సీఎం రేవంత్ రెడ్డి చొరవ అమోఘం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని రమేష్ తెలిపారు. ఉస్మానియా, జేఎన్‌టీయూ (జీచీఖ) వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవజ్ఞుడైన ప్రొఫెసర్ గోవర్ధన్ గారిని బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్‌గా నియమించారని, ఆయన రాకతో ఇప్పుడిప్పుడే యూనివర్సిటీ గాడిన పడుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ గోవర్ధన్ గారి అనుభవాన్ని గుర్తించే ప్రభుత్వం ఆయనను మహబూబ్‌నగర్ యూనివర్సిటీ వీసీగా కూడా నియమించిందని గుర్తు చేశారు. రాత్రి వేళల్లో మెస్సులు, హాస్టళ్లను స్వయంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తున్న గొప్ప అధికారిపై బురదజల్లడం పద్ధతి కాదన్నారు. విద్యార్థులు సైతం ఆయన ఇక్కడి నుంచి వెళ్లొద్దని బతిమిలాడుకుంటున్న వీడియోలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం

విప్లవాత్మక మార్పులు

కొత్త వీసీ నాయకత్వంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రమేష్ వివరించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు అందుతున్నాయని, కేవలం 200 రూపాయల వేతనంతో హౌస్ కీపింగ్‌లో కూలిపని చేసుకునే 19 మంది సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. విద్యార్థుల ప్లేస్‌మెంట్ల కొరకు ఎన్నో కొత్త సంస్థలను తీసుకొస్తూ, క్రమశిక్షణతో యూనివర్సిటీని ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు వీసీ రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం మానుకోవాలి యూనివర్సిటీలో చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని భూతద్దంలో చూపిస్తూ పత్రికలకు, సోషల్ మీడియా గ్రూపులకు ఎక్కించడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని



టార్గెట్ చేసే కుట్ర దాగి ఉందని మమ్మాయి రమేష్ ఆరోపించారు. ఇటీవల నీటి సమస్య తలెత్తితే విద్యార్థులకు సెలవులు ప్రకటించడాన్ని మీడియాలో పెద్ద ఎత్తున నెగెటివ్‌గా చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బాసర ఆలయానికి ?354 కోట్లతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింతగా అభివృద్ధి చేస్తోందని, రాబోయే రెండేళ్లలో బాసర ఆలయం, యూనివర్సిటీ తెలంగాణలోనే ప్రత్యేక స్థానంలో నిలవబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఏవైనా అంతర్గత సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, లేదా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని, అంతేకానీ బాసర ప్రతిష్టను, ఉపాధిని దెబ్బతీసేలా అపోహలు సృష్టించవద్దని కోరారు. అలాగే చిన్న చిన్న కారణాల వల్ల పక్కన పెట్టిన కొందరు ఉద్యోగులను మానవీయ కోణంలో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వీసీ గారిని కోరనున్నట్లు వెల్లడించారు. బాసర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాదవ్ శీను పటేల్, అశోక్, గురప్ప, శంకర్, భోజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంట రుణాల రీషెడ్యూలింగ్ వేగవంతం చేయాలి

తీవ్ర కరువు మండలాల్లో ఐదేళ్లు

మోస్తరు కరువు మండలాల్లో మూడేళ్ల కాలపరిమితి


రెండు కేటగిరీల్లోనూ ఏడాది పాటు మారటోరియం

బ్యాంకర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) కరువు పరిస్థితులతో పంట నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంట రుణాల రీషె డ్యూలింగ్ ప్రక్రియను త్వరి తగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులై న ప్రతి రైతుకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ ఎల్ బీసీ) మార్గదర్శకాల ప్రకారం రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందించాలని సూచించారు.మంగళవారం సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ (డీసీసీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 21 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. వీటిలో కరువు తీవ్రత ఆధారంగా నాలుగు మండలాలను తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా, మిగిలిన 17 మండలాలను మోస్తరు కరు వు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించినట్లు వివరించారు.ఎస్ఎల్బీసీ మార్గదర్శ కాల ప్రకారం తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో అర్హు లైన రైతుల పంట రుణాల ను ఐదేళ్ల కాలపరిమితి కలిగిన టర్మ్ లోన్లుగా మార్చనున్నారు. మోస్తరు కరువు ప్ర భావిత మండలాల్లో రుణాలను మూడేళ్ల (36 నెలలు) కాలపరిమితితో రీషెడ్యూల్ చేయనున్నారు. ఈ రెండు కేటగిరీల రైతులకు కూడా రుణ చెల్లింపులపై మొదటి 12 నెలల పాటుమారటోరియం సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా 2026 ఏప్రిల్ 1 నుంచిసెప్టెంబర్ 30 వరకు మంజూరైన కొత్త పంట రుణాలు, రెన్యువల్ చేసిన రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీ కరించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. అర్హులైన రైతులను గుర్తించి, రుణాల రీషెడ్యూలింగ్ ప్రక్రియ లో ఎలాంటి జాప్యం జర గకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కరువు కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగిం చేందుకు ఈ రుణ పునర్వ్య వస్థీకరణ దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, బ్రాంచ్ మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ అంతరాయం



సోన్, అక్టోబర్ 3(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం 04.11.2026 బుధవారం ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 03:00 గంటల వరకు పాక్ పట్ల నుండి గాంధీనగర్ వరకు గల రోడ్ క్రాసింగ్ విద్యుత్ లైన్లలో పెద్ద స్తంబాలు వేసే పని కారణంగా, పాక్ పట్ల సబ్ స్టేషన్ పరిధిలో గల పాక్ పట్ల, ఓల్డ్ పోచంపాడ్, గాంధీ నగర్ మరియు ఫిల్టర్ బెడ్ పరిధిలో మరియు వ్యవసాయనికి విద్యుత్ సరఫరా అంతరాయము ఉండును. కావున విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు మా విద్యుత్ శాఖకు సహకరించగలరని ఏ డి ఈ నిర్మల్ టౌన్,విద్యుత్ శాఖ అధికారి కొమ్మెర శ్రీనివాస్ రావు తెలిపారు. అందుకు రైతులు సహకరించ గలరని కోరారు. రైతులకు ముఖ్య గమనిక త్రీఫేస్ కరెంటు అంతరాయమును (పోయిన కరెంటు) రాత్రి సమయంలో ఇవ్వబడును,

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తాం

స్లాట్ బుకింగ్‌కు డబ్బులేవని తెలిసి రైతుకు రూ.1,500 అందజేసిన కలెక్టర్



ఆసిఫాబాద్

నవంబరు 3 ప్రజా జ్యోతి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. మంగళవారం దహెగాం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలను అదే రోజు పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. మిగతా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాసేతు యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని సూచించారు. అందిన ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే రాత్రి వేళల్లోనూ పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. నిరాశ పట్టా సమస్యల పరిష్కారానికి స్లాట్ బుక్ చేసుకుంటే తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

రైతుకు ఆర్థిక చేయూత

హత్తిని గ్రామానికి చెందిన పెద్దల బాణక్క మీ సేవలో స్లాట్ బుక్ చేసుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ కె.హరిత వెంటనే స్పందించారు. ఆమెకు రూ.1,500 అందజేసి ఆర్థికంగా చేయూతనిచ్చారు. ఈ సాయం పై బాణక్క కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునవర్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 3,(ప్రజా జ్యోతి) కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనింగ్) ఎన్. హరి ప్రసాద్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా క లిశారు. ఈ సందర్భంగా క లెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలన, పాలనాపరమైన అంశాలు, క్షేత్ర స్థాయి శిక్షణ అనుభ వాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్‌ను అభినం దించిన జిల్లా కలెక్టర్, శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలందించే అధికారిగా రాణించాలని ఆకాం క్షించారు.

కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆదేశాలతో సిర్పూర్ (టి)లో అక్రమ ఇసుక రవాణా పై అధికారుల కఠిన చర్యలు

అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 4 ట్రాక్టర్ లను పట్టుకున్న సిర్పూర్ (టి) తాహసిల్దార్ రహీముద్దీన్

ఘటనకు సంబంధించిన సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి సబ్ కలెక్టర్ ఎదుట బైండోవర్ చేస్తాం:

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం

తాహసిల్దార్ రహీముద్దీన్:



నవంబర్ 3,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్

ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండల కేంద్రంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా జరుగుతుందని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆదేశాలతో అక్ర మ ఇసుక రవాణాపై అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా ఎస్సై వెంకటేష్ తో కలిసి తహసిల్దార్ రహీము ద్దీన్ అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న ప్రదేశానికి చేరుకొని ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను జప్తు చేసి ఇసుకను తరలిస్తున్న సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి కాగజ్నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఎదుట బైండోవర్ చేస్తామని అన్నారు.ఈ సందర్భం గా సిర్పూర్(టి) తాసిల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయవద్దని, ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అంగన్వాడీ పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన

నవంబర్ 4 నుంచి 7 వరకు ప్రక్రియ

మండలాల వారీగా తేదీల ఖరారు

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి: సీడీపీవో రేణుక



ఆసిఫాబాద్, నవంబర్ 3 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబర్ 4 నుంచి 7 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు సీడీపీవో రేణుక తెలిపారు.ఆసిఫాబాద్ మండల అభ్యర్థులకు నవంబర్ 4, 5 తేదీల్లో, రెబ్బెన మండల అభ్యర్థులకు నవంబర్ 6న, తిర్యాణి మండల అభ్యర్థులకు నవంబర్ 7న పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతి, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. నిర్ణీత తేదీల్లో పరిశీలనకు హాజరై ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

తీవ్ర అనారోగ్యం భరించలేక వ్యక్తి బలవన్మరణం



సోన్,నవంబర్ 3 ప్రజా జ్యోతి): సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన చింతల నడిపి గంగన్న శివరాత్రి (54) సంవత్సరాలు, కులం తెనుగు అను అతను గత కొంత కాలంగా ఆనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు.నిర్మల్ లో ఆసుపత్రిలో చూపించుకున్న ఆరోగ్య సమస్యలు తగ్గక పోవడంతో మంగళ వారం 03.రోజునా కడ్తాల్ గ్రామా శివారులో మామిడి తోట లో దోతి తో ఉరి వేసుకోని చనిపోయినాడు. మృతుడికి భార్య,ఒక కొడుకు కలడు. మృతుని కొడుకు అయిన చింతల ప్రసాద్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సబ్‌ఇన్స్పెక్టర్ కే.గోపి వెల్లడించారు.